క్లుప్తంగా

ఆహారాన్ని వృథా చేయరాదు



చింతలగరువులో ఆహార దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: సర్వ జీవరాసి బతకడానికి ఎంతో అవసరమైన ఆహారాన్ని వృథా చేయడం వల్ల భావితరాలకు భయంకరమైన ఆహార కొరత ఏర్పడుతుందని వద్దిపర్రు పంచాయతీ చింతల గరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థులకు వండి తినే ఆహార పదార్థాలు, వండకుండా తినే ఆహార పదార్థాలను గురించి వివరించారు. మానవులకు ప్రాణాధారమైన ఆహారం వినియోగంపై శ్రద్ధ వహించి ఆహార వృథాను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మట్టా నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ మేడిది అనిత తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులో అయ్యప్ప దీక్షలు ప్రారంభం



మేడపాడులో అయ్యప్ప మాల ధరించిన స్వాములు

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలో అయ్యప్ప దీక్షా మందిరంలో గురుస్వామి గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ ఏడాది అయ్యప్ప దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. గురుస్వామి గుర్రాల వెంకట్రావుకు ఇది 38వ పడి అని, నవంబర్ 26న 55 మంది భక్తులతో ఇరుమడులు కట్టుకుని శబరిమల యాత్ర చేస్తామని గురుస్వామి వెంకట్రావు తెలిపారు. 41 రోజులు పాటు జరగనున్న ఈ దీక్షలో మాల వేసుకున్న మాలధారులందరికీ ఉచిత భిక్ష ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆక్వా యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ఉండి: ఆక్వా యాజమాన్య పద్ధతులపై ఎన్నార్పీ అగ్రహారంలోని మత్స్యపరిశోధనా కేంద్రంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించినట్లు ప్రధాన శాస్త్రవేత్త చంద్రశేఖర్ తెలిపారు. ఆక్వాలో మేతల తయారీ, యాజమాన్యంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్, విశ్రాంత శాస్త్రవేత్త పి.రంగాచార్యులు పాల్గొన్నారు.

ముగిసిన తపాలా శాఖ వారోత్సవాలు

భీమవరం: భారత తపాలాశాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం భీమవరం హెచ్‌పోస్టాఫీసులో పోస్ట్‌మెన్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఐబీసీడైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, మెంటే పార్థసారధి మాట్లాడుతూ పోస్ట్‌మెన్స్ సేవలు అభినందనీయమని, తపాలాశాఖలో పోస్ట్‌మెన్ పాత్ర ఎంతో కీలకమన్నారు. కేజీఆర్ఎల్ కళాశాల జాయింట్ సెక్రటరీ అరేటి ప్రకాష్, హెడ్‌పోస్ట్ మాస్టర్ పి.రాజు, చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లకోడు కాలనీ పరిశీలన

ఆకివీడు: ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తాళ్లకోడులోని జగనన్న పేదల కాలనీని హౌసింగ్ రాష్ట్ర ఎండీ అరుణ్ బాబు గురువారం సందర్శించారు. కాలనీలోని ఇళ్ల నిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంపై ఆయన హౌసింగ్ అధికారులను ఆరా తీశారు. అనంతరం నిర్మాణం పూర్తి చేసుకున్న నాలుగు గృహాలకు రంగులు వేసి, ముస్తాబు చేయాలని ఆదేశించారు. కాగా జగనన్న కాలనీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో హౌసింగ్ ఎండీ పర్యటన కొనసాగిందని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, హౌసింగ్ జిల్లా మేనేజర్ పిచ్చయ్య ఉన్నారు.

వివిధ వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని శ్రీ సూర్య స్కూల్‌లో విద్యార్థులకు వివిధ వంటకాలను పరిచయం చేస్తూ గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఇందులో ఏర్పాటు చేసిన స్టాళ్లలో వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. విభిన్న సంస్కృతులను విద్యార్థులకు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.బ్రహ్మాజీ తెలిపారు.

పడకేసిన పల్లె వైద్యం



మేడపాడు పీహెచ్‌సీ వద్ద ఉన్న 104 వాహనం



మేడపాడు పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న స్టాఫ్‌నర్సు

- డాక్టర్ల సమ్మెతో 104 సేవలకు బ్రేకులు
- పీహెచ్‌సీల్లో ఫార్మాసిస్టులు, స్టాఫ్‌నర్సులే వైద్యులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

యలమంచిలి: డాక్టర్ల సమ్మెతో పల్లె వైద్యం పడకేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులంతా సమ్మెకు దిగడంతో నిన్న మొన్నటి వరకు కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ నుంచి వైద్యులను రప్పించి పీహెచ్‌సీల్లో వైద్యం అందించారు. ఇప్పుడు కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ వైద్యులు కూడా సమ్మెకు దిగడంతో ఉన్న కొద్దిపాటి వైద్యులను సర్దుబాటు చేసి రెండు పీహెచ్‌సీలకు ఒక వైద్యుడిని నియమించి వారిని రోజు విడిచి రోజు పీహెచ్‌సీలకు పంపుతూ వైద్యం మమ అనిపిస్తున్నారు. డాక్టర్ రాని రోజుల్లో ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులే రోగులను పరీక్షించి ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. ఇక 104 వాహనంలో వైద్యుడు లేకుండానే ఎంఎల్‌హెచ్‌పీలతో కార్యక్రమం నడిపిస్తున్నారు.

పేదల ఆరోగ్యంపై చిన్నచూపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేరిట మంచం మీద లేవలేని స్థితిలో ఉన్న రోగిల ఇంటికి వైద్యులు వెళ్లి రోగులకు ఉచితంగా వైద్యం చేయడమే కాకుండా మందులు కూడా అందించేవారు. ఇప్పుడు ఇంటింటి వైద్యాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పల్లె వైద్యానికీ చేటు తెచ్చింది. పల్లె వైద్యుల సమస్యకు పరిష్కారం చూపక పల్లె వైద్యానికి బ్రేకులు వేసింది. వైద్యుల సమ్మెతో ఎక్కడి సేవలు అక్కడే ఆగిపోయాయి. పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స పడకేసింది. 104 సేవలు పల్లె చూపుకు దూరమయ్యాయి. ఇవేమి పట్టని కూటమి ప్రభుత్వం పల్లె వైద్యులతో పంతం పెట్టుకుని రోగులకు కన్నీళ్లు పెట్టిస్తోంది. రోగుల ప్రాణాలతో ఓ రకంగా చెలగాట మాడుతోంది. వైద్య సేవలు నిలిచిపోవడంతో పల్లె రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

వైద్య సేవలు నిల్

పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 68 పంచాయతీలు ఉన్నాయి. రెండు లక్షలకు పైగా జనాభా ఉన్నారు. నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా 5 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. పాలకొల్లు మండలం లంకలకోడేరు, పోడూరు మండలం గుమ్మలూరు యలమంచిలి మండలం మేడపాడు, దొడ్డిపట్ల, యలమంచిలి గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో 68 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా మొత్తం నియోజకవర్గంలో 104 వాహనాలు 5 ఉన్నాయి. 104 వాహనాలతో ప్రతి పల్లెలో 15 రోజులకోసారి చికిత్సలు అందిస్తూ వస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు రోజుకొకరు చొప్పున 104 వాహనాలతో పర్యటించి పల్లెరోగులు సేవలు అందిస్తూ వచ్చారు.

సమ్మెతో పేదల జేబులకు చిల్లు

104 వాహనాల సేవల నిమిత్తం పీహెచ్‌సీ వైద్యులు అలవెన్సు ఇవ్వాలన్న డిమాండ్ ప్రభుత్వం ముందు ఉంచారు. కూటమి ప్రభుత్వం దిగి రాకపోవడంతో పల్లెవైద్యులు ఉద్యమబాట పట్టారు. సేవలను నిలిపివేసి సమ్మెలోకి వెళ్లారు. కారణంగా పల్లె రోగులకు కష్టాలు చేరువయ్యాయి. 104 వాహనం గ్రామాలకు వెళుతున్న వైద్యులు లేకుండా, కేవలం ఎంఎల్‌హెచ్‌పీలు వైద్యం చేస్తుండుటతో రోగులు వైద్య సేవలు పొందడానికి ఇష్టపడడం లేదు. ఏ చిన్న రోగం వచ్చినా ఆర్ఎంపీలను ఆశ్రయించి చికిత్సలు పొందుతున్నారు. దీంతో పేదల జేబులకు చిల్లు పడుతుంది.

బోసిపోతున్న పీహెచ్‌సీలు

వైద్యులు లేక పీహెచ్‌సీలు బోసిపోతున్నాయి. ఓపీల సంఖ్య కూడా రోజురోజుకు పడిపోయింది. గత నెల 29 నుంచి డాక్టర్లు సమ్మెలో వెళ్లడంతో పీహెచ్‌సీలలో సేవలు తగ్గుముఖం పట్టాయి. గతంలో 5 పీహెచ్‌సీల్లో రోజుకు 400 ఓపీలు ఉండగా ప్రస్తుతం 300కు దిగజారింది. కారణం పరీక్షలు చేసే వైద్యులు లేకపోవడం. కేవలం ఫార్మాసిస్టులు మందు బిళ్లలు ఇవ్వడం, స్టాఫ్ నర్సుల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రథమ సేవలు మాత్రమే జరుగుతున్నాయి. అయితే ఫార్మాసిస్టులు మందు బిళ్లలు ఇవ్వడంపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండానే ఎలా మందులు ఇస్తారు? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఏదైనా రోగులకు ఇబ్బందులు కలిగితే ఎవరు బాధ్యులు? అంటూ నిలదీస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వైద్యుల సమస్యను పరిష్కరించి సేవలు మొదలు పెట్టాలని కోరుతున్నారు.

ముదునూరిని కలసిన నాయకులు



ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఈరంకి కాశి, నాయకులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ సభ్యుడు ఈరంకి కాశి వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా గురువారం నరసాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించిన వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సిఫారసు చేసిన ప్రసాదరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రసాదరాజును కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా సోషల్ మీడియా కో–కన్వీనర్ బాకూరు సత్య నిరంజనరావు, నాయకులు జమ్ము కాశీ విశ్వనాథం, ఉంద్రాజవరపు రవికుమార్, సానబోయిన దుర్గారావు, గేదెల నరసింహారావు, తెల్ల పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

పెనుగొండ: ధన్వంతరి జయంతిని గురువారం సిద్ధాంతంలో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 18న తిరుపతి గాంధీ భవన్‌లో నిర్వహించే సంజీవని స్వరం పేరున నిర్వహిస్తున్న సంజీవని స్వరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గున్నే పుల్లాజీ, దొడ్డిపట్ల నాగూరు, గొల్లవిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నగర్ పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గురువారం ప్రముఖ దాత కామిశెట్టి అయ్యప్ప నాయుడు రెండు ఫ్యాన్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కె.దుర్గారాణి, సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాయపూడి భవానీ శంకర ప్రసాద్, హెచ్ఎం నిల్లా సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 205 రోజులకు గానూ రూ.9,81,930 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో మంతెన రామ్‌కుమార్ రాజు, వర్థినీడి వెంకటేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన
- ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

నరసాపురం: మద్యం ప్రియుల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యంపై నరసాపురం వైఎస్సార్ సీపీ శ్రేణులు కన్నెర్ర చేశాయి. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, వీధివీధినా వెలిసిన బెల్ట్‌షాపులు నిరోధించాలని కోరుతూ గురువారం పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేతృత్వంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇదేమి ప్రభుత్వం.. ఇదేమి ప్రభుత్వం..ప్రజలు ప్రాణాలు తీస్తున్న దుర్మార్గ ప్రభుత్వం అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకూ ప్రదర్శన సాగింది. మెయిన్‌రోడ్డు, పంజాసెంటర్ మీదుగా ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రాంబాబుకు వినతిపత్రం ఇచ్చి, నకిలీ మద్యం అంశంలో పరిస్థితి మారకుంటే భవిష్యత్‌లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కామన బుజ్జి, ఉంగరాల రమేష్, మొగల్తూరు మండల అధ్యక్షుడు రేవు నారాయణరాజు, సీనియర్ నేతలు షేక్ బులిమస్తాన్, బర్రి శంకరం, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శులు దొంగమురళి, కర్రి ఏసుబాబు, మత్స్యకారనేతలు తిరుమాని నాగరాజు, అంద్రాజు చల్లారావు, కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, వంగా శ్రీకాంత్ కన్నా, యర్రా శ్రీను, అడిదల శరత్, కావలి నాని, మల్లాడి బుజ్జి, జిల్లెళ్ల దిలీప్, సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ బందన పూర్ణచంద్రరావు, వల్లభూని శేఖర్, ట్రేడ్‌యూనియన్ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ షాన్‌వాజ్‌ఖాన్, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చినిమిల్లి చందు, వివిధ విభాగాల పార్టీ నేతలు పోలిశెట్టి గోపీనాథ్, తిర్రే బాబూరావు, కొల్లాబత్తుల రవికుమార్, కాకిలేటి ఆనంద్, రేవు రాంబాబు, పాలా రాంబాబు, తిరుమాని కృష్ణంరాజు, తెన్నేటి గిరి, బళ్ల తాతాజీ, తోట సుబ్బారావు, నిప్పులేటి సత్యనారాయణ, బాషాఖాన్, మాజీ సర్పంచ్ చల్లా సత్యనారాయణ, చదలవాడ మెర్లిన్, నడపన చిన్ని, బిళ్ల బ్రదర్స్, దొండపాటి వెంకట్, ఒడుగు సత్యనారాయణ, కనుమూరి ఆంజనేయులు, కడలి పెద్దిరాజు, కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మోటార్‌సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



నిరసన ప్రదర్శన చేస్తున్న పార్టీ కార్యకర్తలు

ఎంపీపీ, వైస్ ఎంపీపీలు లేకుండానే..!



పెనుగొండ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ మండల పరిషత్ సమావేశం గురువారం ఉత్కంఠభరిత వాతావరణంలో జరిగింది. ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీనులు హాజరుకాకుండానే ఎంపీడీఓ టి.సూర్య నారాయణ మూర్తి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హాజరై శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. 16న సమావేశం నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, ఎంపీడీఓ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, సమీక్షకు ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ హాజరవుతున్నట్లు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, అజెండాలోని అంశాలు ప్రస్తావించకపోవడం వంటి అంశాలపై పట్టుబడుతూ వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు లు సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఏడాది కాలంగా ఎంపీడీఓ అభివృద్ధి పనులపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం, సమాచారం అడిగితే తాత్సారం చేయడం, ప్రతిపాదించిన పనులకు ఎలాంటి నిర్వహణ చర్యలు చేపట్టకపోవడం వంటి అంశాలపై వైఎస్సార్ ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ముందునుంచి ఎంపీడీఓను ప్రశ్నిస్తూ వస్తున్నారు. ఈ తరుణంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే 16న సమావేశం ఏర్పాటు నిర్ణయించడంతో సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే కొందరు ఎంపీటీసీ సభ్యులను అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు బ్రతిమాలడుకొని, ఇతర హామీలు ఎరచూపి హాజరయ్యేటట్టు గట్టి ప్రయత్నాలు చేయడంతో గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఇతర వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులులు హాజరుకాకుండానే సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు హాజరు కాకపోవడంతో నడిపూడికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కట్లమ్మను ప్రోటోకాల్ ఎంపీపీగా నిర్ణయించి ఆమె అధ్యక్షతను మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి, తహసీల్దారు జి.అనిత కుమారి, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ఆచంటలో అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.కృష్ణమోహన్

పెనుగొండ: బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అనర్థాలను నివారించి హక్కులను తెలియజేసేందుకే ఐక్యరాజ్య సమితి బాలికల దినోత్సవం నిర్వహిస్తుందని ఎంపీడీఓ బీఎస్ఎస్ కృష్ణ మోహన్ తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పెనుమంత్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం ఆచంట రామేశ్వరస్వామి సత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళ ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రోజ్‌వెల్ట్ పుట్టిన రోజునే అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. బాలికలు ఎదుర్కొంటున్న లింగ, అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, వివక్షపై అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.కృష్ణకుమారి, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస రావు, ఎంపీటీసీ సభ్యురాలు దాసిరెడ్డి పుణ్యావతి, తహసీల్దారు జి కనకరాజు, ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

యలమంచిలి: ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ప్రతి ఒక్కరూ యూటీఎఫ్ సంఘంలో చేరడానికి ఉత్సుకత చూపడం వెనుక సంఘ పెద్దల కృషి ఉందని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. యూటీఎఫ్ యలమంచిలి మండల శాఖ కౌన్సిల్ సమావేశం గురువారం పాలకొల్లులోని శ్రీ వైష్ణవి హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి 25 మంది మహిళ ఉపాధ్యాయులతో పాటు 150 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశంలో ఆడిటర్‌తో కలిపి మొత్తం 19 మంది ఆఫీస్ బ్యారర్లు, 11 మంది జిల్లా కౌన్సిలర్లు, 44 మంది మండల కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఎస్సీ 2025లో ఎంపికై మండలంలోని వివిధ పాఠశాలలలో విధుల్లో చేరిన వారిని అభినందించారు. అలాగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా మండల శాఖ ఏర్పాటు చేసిన బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన 20 మంది టీచర్లకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా కుడిపూడి సత్యనారాయణ, సహాధ్యక్షులుగా కుసుమ శరత్ బాబు, మహిళా సహాధ్యక్షులుగా బూరగడ్డ శైలజ, అధ్యక్షుడిగా గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పంతం రామమూర్తి నాయుడు, కోశాధికారిగా వర్ధనపు సందీప్ కుమార్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025 – 26 విద్యా సంవత్సరంలో అత్యధిక అడ్మిషన్లు సాధించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ ప్రత్యేక జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లంకలకోడేరులో 'పొలం బడి'



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర్లు

పాలకొల్లు సెంట్రల్: వరి పొలంలో విచక్షణారహితంగా పురుగుమందులు వాడకూడదని, అవసరం మేరకే పురుగు మందులు వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర్లు కోరారు. లంకలకోడేరు గ్రామంలో గురువారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువుల విషయంలో యూరియా సూపర్ పొటాష్‌తోపాటుగా పచ్చిరొట్ట పైరులను వేసి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు పలివెల మురళీకృష్ణ ప్రస్తుతం వరి పంటను ఆశించిన ఆకు ముడత, తాటాకు తెగులు నివారణ చర్యలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్, రైతులు శ్యాము, రామకృష్ణ, బాలకృష్ణ, సత్యనారాయణ గ్రామ వ్యవసాయ సహాయకులు సురేష్, సాయి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌కుమార్

పెనుమంత్ర: సైబర్ నేరాలపై వృద్ధులు అవగాహన పెంచుకుని తమ సెల్‌ఫోన్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి తెలుగురాష్ట్రాల వెల్ఫేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(మేనేజర్) శ్యామ్‌కుమార్ అన్నారు. గురువారం మార్టేరు రోటరీ భవనంలో పెనుమంత్ర మండల సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాప్‌టాప్ ప్రొజెక్టర్ ద్వారా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేస్తూ సీనియర్ సిటిజన్స్‌కు సెల్‌ఫోన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మొబైల్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లపై అవగాహన పెంచుకుని ఫేక్ మెస్సేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ వీడియోలు వచ్చిన ప్పుడు వాటిని వినియోగించరాదని, ఏదైనా ఫోన్‌లో సైబర్ మోసం జరిగినట్లు తెలిస్తే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల జగన్నాథరెడ్డి, కార్యదర్శి చిర్ల నరసింహారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: పోలీసుశాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్‌ను గురువారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ వి.భీమారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోలీసుశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు కూడా సహకరిస్తే మరింత ప్రతిష్టంగా భద్రత కల్పిస్తారన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కేవీవీఎస్ సత్యనారాయణ, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.